మా పెరట్లో కుర్చీలేసుకుని కూచుని కబుర్లలో పడ్డాం.

''ఊరంతా ఎంత మారిపోయిందో? ఎంత గుర్తు చేసుకుందామన్నా అప్పటి వీధులు, ఇళ్లు, భవనాలు ఏమీ గుర్తుకు రావడంలేదు'' అన్నాడు మూర్తి.

''ఐదు దశాబ్దాల కాలం గడిచిపోయింది కదా.. అప్పుడు మన ఊరు గ్రామపంచాయతీ కింద ఉండేది. ఇప్పుడు మండలకేంద్రం అయ్యింది. వ్యాపారాలు పెరిగాయి. వాటితోపాటు రోడ్లు, బిల్డింగులు, ట్రాన్స్‌పోర్ట్.. అన్నీ పెరిగాయి'' అన్నాను.

''నేనీ ఇంటికి చాలాసార్లు వచ్చేవాణ్ని. ఈ వేపచెట్టు కిందనే ఆడుకునేవాళ్లం. కానీ, అప్పుడది పెంకుటిల్లు కదా. ఇంటిముందు అరుగులు కూడా ఉండేవి''

''మా నాన్నగారు చనిపోయాక, పాత ఇంటిని పడగొట్టి పైన రెండు పోర్షన్లు, కింద ఒక పోర్షన్ ఉండేలా ఇల్లు కట్టించాను. నాకిద్దరు మగపిల్లలు. పై పోర్షన్లలో వాళ్లుంటారని కట్టించినవే! అయినా.. ఈ రోజుల్లో పిల్లలెవరూ తల్లిదండ్రుల్ని చూసుకుంటూ ఉన్న ఊళ్లో ఉండటం లేదుగా. మా ఇద్దరబ్బాయిలూ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో సెటిలయ్యారు. పెళ్లిళ్లు.. పిల్లలు! ఎవరి సంసారాల్లో వాళ్లు బిజీ. పలకరించే తీరిక లేనంత బిజీ'' దుఃఖం ఉండలా నా గొంతుకు అడ్డుపడింది.

''మా నాన్న చేసిన బట్టల వ్యాపారమే నేనూ చేశాను. వ్యాపారాన్ని నాలుగింతలు పెంచాను. నాకు ఒక్కడే కొడుకు. వాణ్ని ఇంజినీరింగ్ చదివించి పొరపాటు చేశాను. బట్టల కొట్టులో కూచోవడం నామోషీ అట. బెంగళూర్‌లో ఒరాకిల్‌లో పనిచేస్తున్నాడు. వాడి కొడుకే రఘురాం. కాలేజీకి సెలవు ఇచ్చినప్పుడల్లా హైద్రాబాద్ వచ్చేస్తాడు. నా కొడుకు నుంచి ఆశించిన ప్రేమ.. మనవడి ద్వారా దొరుకుతున్నందుకు సంతోషపడాలో, మా గురించి పట్టించుకోని కొడుకుని తల్చుకుని బాధపడాలో తెలియని పరిస్థితి మాది'' మూర్తి కళ్లు తుడుచుకున్నాడు.

''వంటేం చేయమంటారు? మీ మిత్రుడికి ఇష్టమైన కూరలేమిటో చెప్తే అవే వండి పెడ్తాను'' అంది శకుంతల.

''మూర్తికి బెండకాయ పులుసిష్టం. చిన్న బెల్లమ్ముక్క వేయడం మర్చిపోకు. గడ్డపెరుగు, అందులోకి మజ్జిగ మిరపకాయలు ఎలాగూ ఉన్నాయిగా'' అన్నాను.

''అదేంటీ? మా తాత బెండకాయతో ఏం చేసినా ఇష్టపడడు కదా! మర్చిపోయారా?'' అన్నాడు రఘురాం.

''ఔను కదా! అయినా మతిమరుపుకి నేనేమీ అతీతుణ్ని కాదుగా'' అంటూ నవ్వాను.

''బీరకాయ కందిపప్పు కలిపి కూర చేయి'' అన్నాను నా భార్యతో..

భోజనాలు చేస్తున్నప్పుడు..

''మన క్లాస్‌లో రాజ్యలక్ష్మి అనే అమ్మాయి ఉండేది కదా. నువ్వా అమ్మాయిని చాలా ఇష్టపడేవాడివి. ఇప్పుడెక్కడుందో తెలుసా?''.. నాకు మాత్రమే విన్పించేంత మెల్లగా అడిగాడు మూర్తి.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

''తెలియదు. టెన్త్ క్లాస్‌లో ఆ అమ్మాయిని చాలా గాఢంగా ప్రేమించాను. కానీ ఆ అమ్మాయితో చెప్పేంత ధైర్యం చేయలేకపోయాను. ఇప్పటి జనరేషన్‌కున్న తెగువ, చొరవ మనకెక్కడివి?''.. నేను కూడా శకుంతలకు విన్పించనంత మెల్లగా చెప్పాను.

''ఆరేళ్ల క్రితం బెంగళూరు నుంచి తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ స్టేషన్‌లో కన్పించింది. ఎంత మారిపోయిందో తెలుసా? నేనసలు గుర్తుపట్టలేకపోయానంటే నమ్ము. తనే నన్ను పోల్చుకుని, దగ్గరకొచ్చి పలకరించింది''

''తనకూ అరవై యేళ్లు వచ్చి ఉంటాయిగా! బాగా లావై ఉంటుంది. ఎంత తెల్లగా ఉండేదో కదా..''

''రంగు పెద్దగా మారలేదు. తను హైద్రాబాద్‌లోనే ఇంగ్లీష్ లెక్చరర్‌గా చేసి రిటైరైనట్టు చెప్పింది''

''పక్కన వాళ్లాయన లేడా?''

''లేడు! ఏడాది క్రితం హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడని చెప్పి కన్నీళ్లు పెట్టుకుంది''

''అయ్యో పాపం'' అన్నాను ఇంకేమనాలో తెలియక.

పై బెడ్రూంలో వాళ్లకు పడకలు ఏర్పాటుచేశాను.

శకుంతల మొహం చూస్తేనే అర్థమైంది.. చాలా కోపంగా ఉందని. అటువంటి సమయంలో ఆమెను కదల్చకపోవడమే ఉత్తమమని, పక్కకు తిరిగి పడుకున్నాను.

''ఎవరా రాజ్యలక్ష్మి? నాకెప్పుడూ మీ టెన్త్‌క్లాస్ ప్రేమ గురించి చెప్పలేదే!'' గదిలో నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, శకుంతల నోటినుంచి బుల్లెట్లలా మాటలు దూసుకొచ్చాయి.

''రాజ్యలక్ష్మి ఎవరు?'' అన్నాను ఆశ్చర్యాన్ని నటిస్తూ.

''బుకాయించకండి. మీరు చిన్నగా మాట్లాడుకుంటే నాకు విన్పించవనుకున్నారా? నాకేమీ చెవుడు లేదు'' అంది.

''ఓహ్.. ఆ రాజ్యమా? టీనేజ్ కదా.. ఏదో వెర్రి. దాన్నే ప్రేమనుకుని. అయినా ఎప్పటి విషయమో అది.. ఎప్పుడో మర్చిపోయాను. నాకు రాజ్యాలూ రాణులూ ఎందుకు చెప్పు. నా శాకుంతలం ఉండగా'' అన్నాను.

''చాల్లెండి సంబడం! మీ మాటల మాయలో పడిపోవడానికి నేనేమీ టీనేజ్ అమ్మాయిని కాదు''

శకుంతల ముసిముసిగా నవ్వుకుంటోందని అర్థమైంది.

* * *

ఉదయం పదింటికి మూర్తిని మా స్కూల్‌కి తీసుకెళ్లాను. రిటైర్డ్ హెడ్మాస్టర్‌ని కదా. టీచర్లందరూ ఆత్మీయంగా పలకరించారు.

''ఇతను నా క్లాస్‌మేట్ శ్రీనివాసమూర్తి. మన స్కూల్లోనే పదో తరగతి వరకూ చదువుకున్నాడు. తన స్కూల్ రోజుల్ని రీవిజిట్ చేసుకోవాలన్న కోరికతో హైద్రాబాద్ నుంచి వచ్చాడు'' అంటూ వాళ్లందరికీ పరిచయం చేశాను.

తరగతి గదులన్నీ తిప్పి చూపించాను.

''మనం చదివిన స్కూల్లోనే నువ్వు టీచర్‌గా చేరి, హెడ్‌మాస్టర్‌గా రిటైర్ కావడం గొప్ప విషయం ప్రసాద్. స్కూల్ చాలా మారిపోయింది. ఆ రోజుల్లో ఆరేడు తరగతుల్లో మనం కిందనే కూచునేవాళ్లం. గదులన్నీ రంగులు వెలిసిపోయి, పెచ్చులూడిపోయి ఉండేవి. ఇప్పుడన్నీ పక్కా కాంక్రీట్ గదులే కన్పిస్తున్నాయి. అన్ని గదుల్లో పిల్లలు కూచోడానికి బల్లలున్నాయి. అంతా కొత్తగా కన్పిస్తోంది'' అన్నాడు మూర్తి.

''నేను హెడ్మాస్టర్ అయ్యాక, ఓల్డ్ స్టూడెంట్స్ గెట్